నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 1 ఆగస్టు 2024 | KHAMMAM

# ఆయకట్టు పండేట్టు..

- రేపు సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల
- ఆ తర్వాత పాలేరు రిజర్వాయర్‌కు చేరనున్న జలాలు
- 2.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందనున్న నీరు

కూసుమంచి, జూలై 31 : నాగార్జున సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు శుక్రవారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో ఆ నీరు పాలేరు రిజర్వాయర్‌కు శనివారం వరకు వచ్చి చేరనున్నది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. నీటిని దిగువకు వదలడంతో వేగంగా సాగర్ జలాశయానికి 1.79 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో మరో నాలుగు రోజుల్లో సాగర్ డ్యాం నిండనున్నది. అయితే జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ కింద 2.5 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనుండగా.. వానకాలం సాగు కోసం మరో నాలుగైదు రోజుల్లో పాలేరు నుంచి నీటిని విడుదల చేయనున్నారు. అంతేకాక సాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులన్నింటినీ నింపాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది నీటి కొరతతో పూర్తిస్థాయిలో రైతులు పంటలు వేసుకోలేకపోయారు. వేసిన పంటలు సైతం నీరందక ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో కృష్ణా ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


సాగర్ కాలువలో ప్రవహిస్తున్న నీరు(ఫైల్)

### సాగర్ నీటి విడుదలపై ప్రణాళిక

వానకాలం పంటల సాగుకు నీరు ఇవ్వాలనే ఆలోచనతో అధికారులు యుద్ధప్రాతిపదికన నీటి విడుదల ప్రణాళికను రూపొందిస్తున్నారు. పాలేరు నుంచి కల్లూరు వరకు సాగర్ ఎడమ కాలువ రెండో జోన్ కింద సుమారు 2.5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనుండగా.. ఆయకట్టు రైతులకు నీటి విడుదలతో తీపి కబురు అందినట్లైంది.


# నమ్మించి.. ముంచారు

- అర్హులకు రుణమాఫీ చేయకుండా కొర్రీలు
- రెండోవిడతలోనూ సేమ్ సీన్ రిపీట్
- జాబితాలో పేరు వస్తే వచ్చినట్లు.. లేకుంటే లేనట్లే!
- ఆశపడిన అన్నదాతలకు భంగపాటు

## రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

రూ.2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి నట్టేట ముంచింది. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి రుణమాఫీ కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు భంగపాటు తప్పలేదు. ఇప్పటివరకు రెండుసార్లు విడుదల చేసిన రుణమాఫీ జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. అర్హత ఉన్నప్పటికీ ఎందుకు తమకు రుణమాఫీ రాలేదో అర్థంకాక తికమకపడుతున్నారు. బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మదనపడుతున్నారు. అధికారులను అడిగితే.. మరో జాబితాలో మీ పేరు ఉంటుందని కొందరు, మాకు కూడా ఏమీ తెలియదంటూ కొందరు సమాధానం చెబుతున్నారు. మొత్తానికి రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*- ఖమ్మం, జూలై 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



పంటల రుణమాఫీకి సంబంధించి కోతలు, కొర్రీల ప్రక్రియ రెండోవిడతలోనూ కొనసాగింది. ప్రతిఒక్కరికీ పంట రుణమాఫీ కాకుండా అనేక ఆంక్షలతో వడపోత చేపట్టడం పట్ల అర్హత కలిగిన రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. తొలివిడతలో రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల జాబితా వెలువడిన తరువాత జాబితాలో పేర్లు లేని వందలాది మంది రైతులు సొసైటీలు, బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. అయితే సాంకేతిక కారణాలు, ఇతర పొరపాట్ల వల్ల పేర్లు రాలేదని మరో విడతలో తప్పకుండా పేర్లు వస్తాయని నమ్మబలికారు. దీంతో రెండోవిడత జాబితా విడుదల అయినప్పటికీ మొదటివిడతకు సంబంధించిన రైతుల జాబితాలో అక్కడక్కడ కొందరి పేర్లు మాత్రమే రావడం జరిగింది. రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల పంట రుణాలు తీసుకున్న రైతుల పేర్లు సైతం మాయంకావడంతో అర్హత కలిగి రుణమాఫీ కానీ రైతుల సంఖ్య మరింత పెరిగినట్లైంది. ఈ ప్రభావం ప్రైవేట్ బ్యాంకుల కంటే జిల్లా సహకార బ్యాంకు పరిధిలోని ఆయా బ్రాంచీలు, సహకార సంఘాల్లో మరింత కనపడింది. దీంతో డీసీసీబీ పరిధిలోని అనేకమంది రైతులకు మరోసారి నిరాశ ఎదురైంది.

### రుణమాఫీ వివరాలు..

జిల్లావ్యాప్తంగా నేటివరకు రెండు విడతలు కలిపి సుమారుగా 91,973 మంది రైతులకు రూ.520.76 కోట్లు విడుదలయ్యాయి. మొత్తం మూడు విడతలుగా రూ.2 లక్షలలోపు పంట రుణాలు విడుదల చేయనున్నారు. ఈ నెల 18వ తేదీన తొలివిడతకు సంబంధించి రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న 57,857 మంది రైతులకు రూ.258,25,75,452 విడుదల చేశారు. రెండోవిడతలో భాగంగా 30వ తేదీన రూ.లక్ష నుంచి లక్షన్నర పంట రుణాలు తీసుకున్న 34,111 మంది రైతులకు రూ.262,50,56,893 రుణమాఫీ జరిగినట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. దీంతో రెండు విడతలు కలిపి జిల్లావ్యాప్తంగా 91,973 మంది రైతులకు రూ.520,76,32,345 రుణమాఫీ జరిగినట్లైంది. 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్‌లోపు రూ.2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపచేశారు. నేటివరకు రెండువిడతల్లో కలిపి రూ.1.50 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ జరగగా, మిగిలిన రైతులకు రూ.1.50 లక్షల పైగా పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందనేది స్పష్టత రావాల్సి ఉంది.

### పూర్తి జాబితాపై కొరవడిన స్పష్టత..

2018 సంవత్సరం డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టంగా తెలిపింది. అయితే ఈ గడవులో జిల్లావ్యాప్తంగా రైతులు ఏఏ బ్యాంకుల్లో రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్నారు. వారికి ఎన్ని నిధులు అవసరం ఉంటుంది.. అనే వివరాలపై నేటివరకు స్పష్టత లేదు. సాధారణంగా జిల్లా లీడ్ బ్యాంక్ రుణమాఫీ ప్రకటించిన సమయంలో ఆయా బ్యాంకుల నుంచి వివరాలు సేకరించి, అర్హత కలిగిన వారి సంఖ్యను ప్రకటిస్తుంది. గడిచిన ఆరునెలల నుంచి రుణమాఫీ పథకంపై చర్చ జరుగుతున్నప్పటికీ నేటివరకు సైతం అసలు పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య ప్రకటించకపోవడం ప్రతిఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. దీంతో రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఎంతమంది ఉన్నారు. వారిలో ప్రభుత్వం విధించిన అనేక ఆంక్షలు పోను ఎంత మంది రైతులు రుణమాఫీకి అర్హత పొందారో తెలియని అయోమయ పరిస్థితి జిల్లావ్యాప్తంగా నెలకొంది. జాబితాలో పేరు వస్తే ఉన్నట్లు లేకపోతే లేనట్లు అన్న రీతిలో క్షేత్రస్థాయిలో రైతుల్లో చర్చ జరుగుతున్నది. ఇప్పటికైనా జిల్లా లీడ్ బ్యాంకు అధికారులు మొత్తం అర్హత కలిగిన రైతుల వివరాలను ప్రకటిస్తే రుణమాఫీ ప్రక్రియలో స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.

### పంట పెట్టుబడి కష్టమే..



ప్రతి యేటా మూడెకరాల వరి పంట సాగుచేస్తున్నాను. పంట పెట్టుబడికి దమ్మపేట సొసైటీలో రుణం తీసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తారని ఆశించాను. రుణమాఫీ కాలేదు. దీనికి తోడు వరి పంటకు బోనస్ ఇస్తామని చెప్పి మాట తప్పారు. ప్రైవేటు అప్పులు చేస్తే అధిక వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి. అసలే అంతంతమాత్రంగా ఉన్న సాగుతో ఇబ్బందులు మరీ ఎక్కువయ్యాయి.

**– కట్ల రాజు, మల్లారం, దమ్మపేట మండలం**

### ఆశపడ్డాను.. భంగపడ్డాను



నాకు మూడున్నర ఎకరాల భూమి ఉంది. పంటలు సరిగా పండక అప్పులయ్యాయి. రుణమాఫీ జరిగితే కొంత ఆసరా అవుతుందనుకున్నా. రేషన్‌కార్డు లేకపోవడంతో రుణమాఫీ అర్హుల జాబితాలో నాకు చోటుదక్కలేదు. వ్యవసాయానికి పెట్టుబడి ఎక్కడ తీసుకురావాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాను. రుణమాఫీకి ఆశపడి భంగపడ్డాను.

**వాడపల్లి జకరయ్య, మొద్దుల గూడెం, దమ్మపేట మండలం**

### బ్యాంకుల వారీగా రెండోవిడత రుణమాఫీ వివరాలు

| బ్యాంకు | రైతుల సంఖ్య | రుణమాఫీ అయిన నిధులు |
|---|---|---|
| ఏపీజీవీబీ | 10,216 | రూ.104,14,88,153 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 461 | రూ.4,59,92,41 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 09 | రూ.9,95,726 |
| కెనరా బ్యాంకు | 405 | రూ.4,06,76,219 |
| సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా | 146 | రూ.1,47,23,221 |
| డీసీసీబీ | 13,500 | రూ.64,07,55,818 |
| హెచ్‌డీఎఫ్‌సీ | 03 | రూ.3,86,563 |
| ఐడీబీఐ | 09 | రూ.8,47,722 |
| ఇండియన్ బ్యాంకు | 83 | రూ.80,31,676 |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు | 190 | రూ.1,58,40,177 |
| పంజాబ్ నేషనల్ బ్యాంకు | 35 | రూ.41,60,749 |
| స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 4,299 | రూ.43,96,59,776 |
| యూనియన్ ఆఫ్ ఇండియా | 4,586 | రూ.37,14,98,652 |
| మొత్తం | 33,942 | రూ.262,50,56,893 |

### రెండు బ్యాంకుల్లో తీసుకున్న..



నా పేరు రుణమాఫీలో లేదు. సొసైటీలో రూ.20 వేలు, స్టేట్‌బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకున్న. రెండోవిడతలో నా పేరు వస్తుందని అనుకున్నా తీరా చూస్తే రాలేదు. ఇదెక్కడి న్యాయం. పొలం వేసుకుంటున్నాము. మాకు రుణమాఫీ రాకపోతే అప్పు ఎలా తీర్చాలి. పెద్దసార్లు ఆలోచించి న్యాయం చేయాలి.

**– అజ్మీరా హిరాణి, పూప్లాతండా, సుజాతనగర్ మండలం**

### నేను నడవలేని రైతును..



రుణమాఫీ అయితుందని ఆటోలో వచ్చిన. నాకు ఆరోగ్యం బాగా లేదు. నడవలేకపోతే నన్ను ఆటోలో తీసుకొచ్చారు. మా వాళ్లు వెళ్లి అడిగితే రుణమాఫీ కాలేదన్నారు. అప్పు నేను తీర్చలేను. పంటలో లాభం రాలేదు. చాలా కష్టాలు పడుతున్నాను. నన్ను ఆదుకోవాలి.

**– బానోత్ భద్రు, రూప్లాతండా, సుజాతనగర్ మండలం**

# రైతుల పడిగాపులు

- రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై అన్నదాతల అసహనం


కొత్తగూడెం సొసైటీ కార్యాలయంలో రుణమాఫీ ఎందుకు రాలేదని అధికారులను అడుగుతున్న రైతులు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 31 (నమస్తే తెలంగాణ) : 'పేరు గొప్ప – ఊరు దిబ్బ' అన్న చందంగా ఉంది కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ తీరు. ఆగస్టు 15 నాటికి అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సర్కారు మాటలు ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోతున్నాయి. కనీసం రూ.20 వేలు, రూ.30 వేలు తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మిగతా రైతులకు వచ్చి తమకు ఎందుకు రాలేదని బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం సొసైటీ పరిధిలో నాలుగు మండలాల రైతులు సహకార సంఘంలో రుణాలు తీసుకున్నారు. లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెంకు చెందిన మొత్తం 3,140 మంది రైతులు రుణాలు తీసుకుంటే మొదటి విడతగా 639 మందికి, రెండోవిడత 269 మందికే రుణమాఫీ అయ్యింది. దీంతో ఆయా మండలాల రైతులు సొసైటీకి వచ్చి మా సంగతేందంటూ అధికారుల్ని నిలదీస్తున్నారు.

### బ్యాంకుల వద్ద పడిగాపులు..

మొదటివిడతలో వారంరోజులు తిరిగినం.. రెండోవిడతలో ఎన్ని రోజులు తిరగాలో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో కొర్రీలు పెట్టి రుణమాఫీ జాబితాలో పేర్లు లేకుండా చేయడంతో రైతన్న కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఒక్క సహకార బ్యాంకుల ద్వారానే 49,099 మంది రైతులు రూ.లక్షలోపు, రూ.లక్షయాభై వేల లోపు రుణాలు తీసుకుంటే నాలుగువేల మందికి కూడా రుణాలు మాఫీకాకపోవడం విశేషం. ఇది కేవలం సొసైటీ పరిధి మాత్రమే. ఇక బ్యాంకుల లెక్కలపై అధికారులు పెదవి విప్పడం లేదు. వ్యవసాయాధికారిని అడిగితే బ్యాంకుకు వెళ్లండి అని బ్యాంకుకు వెళ్తే ఏవో సార్‌ను అడగాలని తిప్పడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సర్కారు తీరుపై రైతుల అసహనం..

రుణమాఫీ విషయంలో సర్కారు పెడుతున్న కొర్రీలపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూటకోమాట రోజుకో నిబంధన పెట్టి మా ఉసురుపోసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికోసం రైతువేదికల వద్ద సమావేశాలు పెట్టి రుణమాఫీ అయిన వారిని పిలిచి వారి పేర్లు చదువుతున్నారు.. కాని రానివారిని ఎందుకు పిలవడం లేదని ప్రశ్నిస్తున్నారు. కనీసం మూడోవిడతలోనైనా తమ పేర్లు వస్తాయో రావో అని చూసిన తర్వాత ఆందోళన చేస్తామని రైతు సంఘం నాయకులు చెప్తున్నారు.

# ఎమ్మెల్యే సబితకు.. సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

- గౌరవప్రదమైన శాసనసభను కౌరవసభగా మారుస్తారా.?
- మహిళలను అవమానించడమే కాంగ్రెస్ విధానమా?: రేగా



సారపాక/ మణుగూరు టౌన్, జూలై 31:గౌరవప్రదమైన శాసనసభను కౌరవసభగా మార్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీ సాక్షిగా అవమానించారని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. నిండు సభలో సబితమ్మ కంట కంటతడి పెట్టించిన కాంగ్రెస్‌కు తగిన శాస్తి జరుగుతుందని స్పష్టం చేశారు. బుధవారం నాటి అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను రేగా కాంతారావు ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ ప్రజాపాలన అంటూ చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రాక్షస పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అసలు సిసలు కాంగ్రెస్ వాది అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి సబితా ఇంద్రారెడ్డిని చెల్లెమ్మలా గౌరవిస్తే.. నకిలీ కాంగ్రెస్ నాయకుడైన రేవంత్‌రెడ్డి ఆమెను అగౌరవపరిచి అవమానిస్తున్నారని ఆరోపించారు. 'మహిళలను అవమానపర్చడమే కాంగ్రెస్ విధానమా?' అని ప్రశ్నించారు. అసెంబ్లీ గౌరవాన్ని రేవంత్‌రెడ్డి తగ్గిస్తున్నారని, కక్షపూరితంగా వ్యవహరించి సబితను మనోవేదనకు గురిచేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే సబితమ్మకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పటిష్టంగా రెవెన్యూ వ్యవస్థ

## ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జూలై 31 : రెవెన్యూ వ్యవస్థ మరింత పటిష్టంగా ఉండేందుకు మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చూడాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రజావాణి, ధ్రువీకరణలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని డీటీ, ఆర్‌ఐ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ అన్ని క్యాటగిరీలకు చట్టాలపై అవగాహన కలిగేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ధరణి దరఖాస్తులు సమర్పించే సమయంలో మాడ్యూల్ ప్రకారం సంబంధిత డాక్యుమెంట్లు జత చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు సమర్పించిన నెలలోనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రతి తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ధరణి సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, దరఖాస్తు చేసే ముందు దరఖాస్తుదారునికి పూర్తి అవగాహన కలిగేలా గైడ్ చేయాలని సూచించారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు ఇందులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం శాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి.. స్వీకరించిన అర్జీలపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, మానవ హక్కుల, గ్రీన్ ట్రిబ్యునల్ తదితర కమిషన్లకు నివేదికలు సమయంలోగా సమర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల పరిశీలన పెండింగ్ లేకుండా వెనువెంటనే పూర్తి చేయాలన్నారు. చెరువుల భూముల విషయమై ఇరిగేషన్, రెవెన్యూ, గూగుల్ మ్యాపులు సరిచూసుకొని ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు జి.గణేశ్, ఎల్.రాజేందర్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 31 (నమస్తే తెలంగాణ) : వరదకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు ముంపు ప్రాంత ప్రజలకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గోదావరి వరదల కంట్రోల్ రూమ్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మీరిచ్చే సమాచారంపైనే అధికారులు తీసుకునే చర్యలు ఉంటాయని, మీరు అలర్ట్‌గా ఉంటూ.. అందరినీ అప్రమత్తం చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

## ఐటీడీఏ పీవో రాహుల్


లాటరీ ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, జూలై 31 : ప్రభుత్వం గిరిజన విద్యార్థినీ విద్యార్థుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీవో బీ రాహుల్ ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న 29 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో పీవో ఛాంబర్‌లో లాటరీ ద్వారా బుధవారం ఎంపికలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు. డ్రాలో సీటు వచ్చిన విద్యార్థులు ఆయా తరగతుల్లో చేరకపోతే వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి సీట్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయలక్ష్మి, డీఈవో కార్యాలయ సీఎంవో రాజశేఖర్, ఏవో నారాయణరెడ్డి, అకౌంటెంట్ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలల్లో భారీగా బదిలీలు

- 'అటానమస్'లో కూడా భర్తీకాని పోస్టులు
- మహిళా డిగ్రీ కళాశాలలో 12 మందిలో 10మంది బదిలీ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 31 : డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల్లో భారీగా బదిలీలు జరిగాయి. 40శాతం బదిలీలు అనే నిష్పత్తిని పరిగణనలోకి తీసుకోకుండా నాలుగు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన అధ్యాపకులందరిని బదిలీ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కేటాయింపులు జరిగాయి. అధ్యాపకుల బదిలీలతో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఏర్పడనుండడంతోపాటు విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ బదిలీలపై అధ్యాపకులు సైతం ఒకింత ఆశ్చర్యానికి గురికావడంతోపాటు అసంతృప్తిగానే ఉన్నారు.

### న్యాక్ ఏ++ కళాశాలలోను ఖాళీలు...

రాష్ట్రంలోనే ఏకైక న్యాక్ ఏ++ కళాశాలగా ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఉంది. ఈ కళాశాలలో డిగ్రీలో 4వేల మంది, పీజీలో 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. 70 మంది రెగ్యులర్ అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరిలో 46 మందికి బుధవారం జరిగిన బదిలీల ప్రక్రియలో ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కళాశాలపరంగా 46మంది బదిలీ కాగా అదేస్థాయిలో ఈ కళాశాలను అధ్యాపకులు ఎంపిక చేసుకోకపోవడంతో ఖాళీలున్నాయి. రాష్ట్రంలో ప్రఖ్యాతి పొందిన కళాశాల అయినప్పటికీ ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో తెలుగు విభాగంలో మూడు ఖాళీలు, కెమిస్ట్రీ విభాగంలో రెండు, ఫిజిక్స్, ఇలా ఆర్ట్స్, కామర్స్ అన్ని విభాగాల్లో పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీకాలేదు. ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో అధ్యాపకులకు అత్యధిక వర్క్‌లోడ్ ఉంటుంది. బోధనతోపాటు ఎప్‌సెట్, పాలిసెట్, ఐసెట్, వంటి కౌన్సిలింగ్‌లు అత్యధిక రోజులు నిర్వహిస్తుంటారు. వీటికోసం అధ్యాపకులు కృషి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అయినా ఉన్నతాధికారులు దృష్టి సారించి మార్పులు చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు.

### ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో...

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల్లో 12మంది రెగ్యులర్‌లో 10మందికి బదిలీ అయ్యింది. అదేస్థాయిలో ఈ కళాశాలలో ఇతరప్రాంతాల నుంచి అధ్యాపకులను కేటాయించలేదు. దీంతో అడ్మినిస్ట్రేషన్‌పరంగా, బోధనలో సమస్యలు తలెత్తనున్నాయి. బదిలీల ఉత్తర్వులు బుధవారం మధ్యాహ్నం విడుదల కాగా బుధవారం సాయంత్రానికి అత్యధిక మంది రిలీవ్ అయ్యి గురువారం ఉదయానికి కేటాయించిన స్థానాల్లో రిపోర్ట్ చేయనున్నారు.

# ఉపాధ్యాయుల కోసం ఆందోళన



తోకబందాల ప్రాథమిక పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

లక్ష్మీదేవిపల్లి, జూలై 31 : తమ గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం తోకబందాల గ్రామానికి చెందిన గిరిజనులు పిల్లలతో కలిసి ప్రాథమిక పాఠశాల ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ఈ విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమ గ్రామం మండల కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నదని, ఇక్కడ సుమారు 12 మంది విద్యార్థులున్నా ఉపాధ్యాయులు లేకపోవడంతో వారి భవిష్యత్ ఆందోళనకరంగా మారిందన్నారు. కలెక్టర్‌తోపాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించేలా చూడాలని వేడుకున్నారు.